క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం



విగ్రహాల ప్రతిష్ట పూజలు చేస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: పట్టణంలో జీర్ణోద్ధరణ చేసిన సోమలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి విగ్రహ ప్రతిష్ట పూజలు ప్రారంభమయ్యాయి. గణపతి, పార్వతి, నంది, నాగ, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు గోపూజ, గంగానయనం, గణపతిపూజ, స్వస్తివాచనం, మాతృకా పూజ, రక్షాబంధనం, పంచగవ్యమేళన, ప్రోక్షణ, యాగశాల ప్రవేశం, ద్వార పూజ, షడోశ స్తంభ పూజ, సర్వతోభద్ర మండల సహిత గణపతి, శివపార్వతి, ప్రధాన కలశస్థాపన, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 28వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు బీవీ ప్రసాద రెడ్డి, జీవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని కంబాలపాడు రోడ్డు, ఇందిరానగర్, జాడీల ప్యాక్టరీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాల మార్పు, లైన్ షిఫ్టింగ్ పనుల కారణంగా రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళ, బుధవారాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఆలయానికి వీల్‌చైర్ల విరాళం



వీల్ చైర్లను అందజేస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి దర్శనార్థం వచ్చే దివ్యాంగులు, వృద్ధుల కోసం కర్నూలు ఇండియన్ రెడ్ క్రాస్ సభ్యులు 5 వీల్ చైర్లను అందజేశారు. సోమవారం కర్నూల్ ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్, కార్యదర్శులు డాక్టర్ గోవిందరెడ్డి, శ్రీనివాసులు ఆలయ ఈఓ రామాంజనేయులుకు వీల్ చైర్లను అందజేశారు.

నదుల అనుసంధానంతో రాష్ట్రం సుభిక్షం

బనగానపల్లె రూరల్: నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రాన్ని సుభిక్షంగా మారుస్తామని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చెరువుపల్లె గ్రామంలో ఉన్న అక్కాజమ్మ చెరువుకు జీఎన్ఎస్ కాల్వ వద్ద ఏర్పాటు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మోటార్లను ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇక్కడ ఏర్పాటు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్‌కు తాను ఎమ్మెల్యేగా ఉండగానే రూ.2.28 కోట్లు మంజూరు చేయించామని గుర్తు చేశారు. ఆ తర్వాత వచ్చిన నాయకులు పట్టించుకోలేదన్నారు. నీటి విడుదలతో అక్కాజమ్మ చెరువు కింద ఆయకట్టు రైతులకు సాగు నీటితో పాటు పరిసర గ్రామాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని పేర్కొన్నారు.

వర్షం కోసం పూజలు



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

కొలిమిగుండ్ల: మండలంలోని తిమ్మనాయినపేటలో చెరువు వద్ద వర్షం కోసం గ్రామస్తులు సోమవారం పూజలు నిర్వహించారు. వేదపండితులు సుబ్రమణ్యశర్మ, రామగోవిందయ్య, కాశీవిశ్వనాథ, సుధీర్‌కుమార్, నరసింహరావు, పేరుసోముల శ్రీధర్‌శర్మ శివునికి అభిషేకం చేసి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. విరాట పర్వాన్ని చదివి వినిపించారు. వర్షాలు లేక చెరువులో నీరు అడుగంటిపోయాయి. వరుణుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురవాలనే ఉద్దేశంతో పూజలు నిర్వహించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

డోన్ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి పరిస్థితి విషమించడంతో సోమవారం మృతిచెందాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన బోయ హరికృష్ణ(40) కొద్ది రోజుల క్రితం ట్రాక్టర్‌పై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. మృతుని తండ్రి చెన్నమ నాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి



ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యులు, పారామెడికల్ సిబ్బందిపై ఇటీవల కాలంలో దాడులు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. రేయింబవళ్లు ప్రజలకు వైద్య సేవలు అందించే వైద్య సిబ్బందికి రక్షణ లేకపోతే ఎలా పనిచేస్తారు. మహిళా వైద్యులతో పాటు రాత్రి వేళల్లో విధులు నిర్వహించే సిబ్బందికి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సెక్యూరిటీని పటిష్టం చేయాలి.

–డాక్టర్ హనీఫ్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్, డోన్



దాడి చేస్తే కఠిన చర్యలు ఉండాలి



ప్రాణాలు పోసే వైద్యులకు రక్షణ కల్పించాలి. వైద్యులపై దాడి చేస్తే కఠిన శిక్షలు పడేలా చట్టాలు ఉండాలి. కొందరు మద్యం సేవించి వచ్చి వైద్యులు, సిబ్బందితో దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఇలాంటివి జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలి. పీహెచ్‌సీల వద్ద విధులు నిర్వహించే సిబ్బందికి రక్షణ కల్పించాలి. ఇటీవల కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన అమానుషం. నిందితులను కఠినంగా శిక్షించాలి.

–డాక్టర్ శివశంకరుడు, మెడికల్ ఆఫీసర్, టంగుటూరు పీహెచ్‌సీ

నాటుసారా విక్రేత అరెస్ట్

బనగానపల్లె: నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామక్రిష్టాపురం గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న నల్లకారి మద్దిలేటి అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ బీటీ వెంకట సుబ్బయ్య సోమవారం తెలిపారు. నిందితుడు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అతని వద్ద నుంచి 20 లీటర్ల సారా సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



ప్యాపిలి: చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు



కొలిమిగుండ్ల: నాయినపల్లెలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



బనగానపల్లె: యనకండ్లలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కొలిమిగుండ్ల: గీతా పారాయణం పఠిస్తున్న భక్తులు

కృష్ణం వందే జగద్గురుమ్

- భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- కృష్ణుడు, గోపికల వేషధారణల్లో ఆకట్టుకున్న చిన్నారులు
- ఉట్టికొట్టి సందడి చేసిన భక్తులు



బేతంచెర్ల: గోపాలకృష్ణ బృందావనంలో శ్రీకృష్ణుడు



కోవెలకుంట్లలో పూజలందుకుంటున్న శ్రీకృష్ణుడు



ప్యాపిలి: ఉట్టి కొడుతున్న చిన్నారులు

కోవెలకుంట్ల: బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కోవెలకుంట్లలోని ఎస్ఎల్‌వీటీ సినిమా థియేటర్ సమీపంలో పట్టణానికి చెందిన ప్రబోధానంద సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని విగ్రహం ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఆరు రోజుల పాటు జరిగే వేడుకల్లో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు ఏర్పాటు చేశారు. వేడుకల్లో భాగంగా మొదటి రోజు మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి ప్రత్యేక పూజ లు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ నెల 31వ తేదీ శ్రీకృష్ణుని విగ్రహానికి ఊరేగింపు కార్యక్రమం చేపట్టనున్నట్లు ప్రబోధా సేవాసమితి కోవెలకుంట్ల అధ్యక్షుడు జనార్దన పేర్కొన్నారు. చిన్నారులు శ్రీకృష్ణుని వేషధారణలో అలరించారు. సేవా సమితి ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు,రామసుబ్బారెడ్డి, సభ్యులు మధుసూదన, సుబ్బారావు, సుధాకర్, చౌడయ్య, వెంకటరమణ, రామసుబ్బయ్య, లీలావతి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

బేతంచెర్ల: నంద్యాల రహదారిలోని గోపాలకృష్ణ బృందావనంలో ఆలయ కమిటీ సభ్యులు గూని నాగరాజు, మద్దిలేటి, వెంకట్, పద్మనాభుడు ఆధ్వర్యంలో అర్చకుడు చిరంజీవి స్వామివారికి ప్రత్యేక పూజ లు చేశారు. పూదోట మఠం, అమ్మవారిశాలలోని శ్రీకృష్ణుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నా రు. సిమెంట్ నగర్‌లోని క్రిష్ణమ్మ కోనలో వెలసిన రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడుకి అర్చకుడు కిట్టయ్య అభిషేకం, కుంకుమార్చన, తులసీనామార్చన చేసి మహామంగళహారతి ఇచ్చారు. భజన కార్యక్రమాలతో పాటు భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం బేతంచెర్లలో శ్రీకృష్ణుని విగ్రహాన్ని కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు.

డోన్ టౌన్: ప్రబోధ సేవా సమితి–ఇందూ జ్ఞానవేదిక వ్యవస్థాపకుడు శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల శిష్యులు డోన్ పాత బస్టాండ్‌లో మండపం ఏర్పాటు చేసి విగ్రహం నెలకొల్పారు. ఉదయం ప్రత్యేక అలంకరణ, అర్చనలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం భగవద్గీత శ్లోకాలను పఠించారు. అలాగే పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషాధారణతో ఆకట్టుకున్నారు. సంప్రదాయ నృత్యాలు, ఉట్టి కొట్టే కార్యక్రమాలతో సందడి చేశారు.

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లె గీతాశ్రమంలోని శ్రీకృష్ణుని ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఏకధాటిగా గీతాపారాయణం పఠించారు. భజనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. త్రైత సిద్ధాంతం సభ్యుల ఆధ్వర్యంలో కొలిమిగుండ్ల, నాయినపల్లె, మీర్జాపురం గ్రామాల్లో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. నాయినపల్లెలో స్వామి వారి విగ్రహాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు.

డోన్: శ్రీకృష్ణాష్టమి వేడుకలు డోన్‌లో అంగరంగ వైభవంగా జరిగాయి. వైష్ణవ దేవాలయాలు వేకువజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు

ప్యాపిలి: స్థానిక కొత్త బస్టాండ్ వద్ద త్రైత సిద్ధాంతం- ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుని ప్రతిమను ప్రజలు దర్శించుకున్నారు. స్థానిక సరస్వతి శిశు మందిరం విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో నిర్వహించిన శోభాయాత్ర ఆకట్టుకుంది. ప్రధాన కూడళ్లలో విద్యార్థులు ఉట్టి కొట్టి సందడి చేశారు. శివసాయి పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

బనగానపల్లె: మండలంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నందవరం, యనకండ్ల, బనగానపల్లె తదితర గ్రామాల్లోని ఆలయాల్లో యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



డోన్: పాతబస్టాండ్‌లో శ్రీకృష్ణుని విగ్రహానికి పూజలు



బేతంచెర్లలో గోపికలు, చిన్ని క్రిష్ణుడి వేషధారణలో చిన్నారులు



బేతంచెర్లలో శ్రీకృష్ణుడిని రథంపై ఊరేగిస్తున్న భక్తులు

బెలుం గుహలను తిలకించిన కలెక్టర్



గుహను తిలకించేందుకు వెళుతున్న కలెక్టర్ రాజకుమారి

కొలిమిగుండ్ల: సహజ సిద్ధంగా అవతరించి పర్యాటకులను ఆకట్టుకుంటున్న బెలుం గుహల అందాలను జిల్లా కలెక్టర్ రాజకుమారి సోమవారం తిలకించారు. కలెక్టర్ గుహల వద్దకు చేరుకోగానే గుహల యూనిట్ మేనేజర్ అమర్‌నాథ్‌రెడ్డి, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం గుహ లోపల ఏర్పడిన సహజ సిద్ధ ప్రాంతాలను ఆసక్తిగా తిలకించారు. గుహల ప్రాధాన్యత, ఎప్పుడు ఏర్పడ్డాయి తదితర అంశాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేసి విద్యార్థులకు బస్సుల్లో విహార యాత్రల ద్వారా చారిత్రక ప్రదేశాల గురించి వివరించేందుకు ఏర్పాట్లు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే కలెక్టర్ గుహలను పరిశీలించేందుకు వచ్చారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు

బేతంచెర్ల: ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని.. లేకుంటే ప్రజల పక్షాన పోరాటాలకు సిద్ధం అవుతామని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. సోమవారం మండలంలోని అంబాపురం గ్రామంలో సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, నాయకులు సంజీవుడు, ఎర్రగుడి రాముడు, సామన్న ఆధ్వర్యంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. గ్రామాల్లో రాచరికాన్ని వదిలి ప్రజాస్వామ్య పాలన అందించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు శ్రీరాములు, నాగేశ్వరరావు, నాగేష్, భాస్కర్ పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్టు

డోన్ టౌన్: సారా విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. పట్టణంలోని శ్రీరామనగర్‌కు చెందిన మౌలాలమ్మ, కొత్తపేటకు చెందిన బోయ అంపమ్మలు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు సోమవారం దాడి చేసి పట్టుకున్నామని చెప్పారు. ఒక్కొక్కరి నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా తెలిపారు.

జిల్లా సీనియర్ చెస్ జట్ల ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం వివేకానంద ఆడిటోరియంలో సీనియర్ ఓపెన్ బాలికల నంద్యాల జిల్లా చెస్ ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్, క్రీడా భారతి కార్యదర్శి సుధాకర్ ప్రారంభించారు. చెస్ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని 200 మంది పాల్గొన్నట్లు డాక్టర్ రవికృష్ణ తెలిపారు.

ఘనంగా ఉమామహేశ్వరుని పల్లకీ సేవ



పల్లకీలో విహరిస్తున్న శివపార్వతులు

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలోని ఉమామహేశ్వరస్వామికి సోమవారం రాత్రి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, విశేష అలంకరణ, నైవేద్య సమర్పణ చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మహానందిలో భక్తుల సందడి

నంద్యాల(అర్బన్): శ్రావణ సోమవారం సందర్భంగా మహానంది క్షేత్రానికి భక్తులు తరలివచ్చారు. ముందుగా భక్తులు కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాధారణ దర్శనం, స్పర్శ దర్శనం, అభిషేకాలకు వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఆలయ అధికారులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మదర్ థెరిసా సేవలు ఎనలేనివి

డోన్ టౌన్: సమాజ సేవకురాలు, నోబెల్ శాంతి పురస్కారం, భారత రత్నా వార్డు గ్రహీత మదర్ థెరిసా సేవలు ఎనలేనివని సామాజిక కార్యకర్త మమ్మద్‌రఫీ అన్నారు. సోమవారం ఆమె జయంతిని పురస్కరించుకుని తారకరామనగర్‌లోని సంస్థ కార్యాలయంలో థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులకు మదర్ థెరిసా గొప్పతనం, సేవలను వివరించారు.

యువకుడి ఆత్మహత్య

బేతంచెర్ల: అనారోగ్యానికి తోడు కుటుంబ సమస్యలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన బోయినపల్లి హనుమంత్ (35) అలియాస్ మాస్‌కు పదేళ్ల క్రితం అంకిరెడ్డిపల్లెకు చెందిన మాదిగ చిన్న కుళ్లాయమ్మతో వివాహమైంది. వీరికి సంతానం లేదు. హనుమంత్ అప్పుడప్పుడు కడుపునొప్పితో బాధపడేవాడు. భార్య పది రోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. జీవితంపై విరక్తితో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్ది సమయం తర్వాత కుటుంబ సభ్యులు ఇంటి తలుపులు తెరిచి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ షేక్షావలి తెలిపారు.

ఉధృతంగా కుందూ

నంద్యాల(అర్బన్): నంద్యాల సమీపంలో కుందూనది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇటీవల శ్రీశైలం రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండటంతో కుందూ నదికి నీటిని అధికంగా విడుదల చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులు ఇదివరకే ఆదేశాలు జారీ చేశారు.

210 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ వద్ద ఆటోలో అక్రమంగా కర్నూలుకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా తెలిపారు. పట్టణానికి చెందిన సుధాకర్ అనే వ్యక్తి 210 కేజీల రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి కర్నూలులో అధిక రేటుకు విక్రయించడానికి తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు వెల్లడించారు. ఆటో, బియ్యాని సీజ్ చేసి సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

డోన్ టౌన్: స్థానిక శ్రీనివాసనగర్‌లోని చర్చి సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.11,550 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా సోమవారం తెలిపారు. పట్టణానికి చెందిన సూరిబాబు, మధు, కమాల్‌బాషా, రాజేష్, చంద్రన్నగౌడ్, రంగ, రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా పేకాట ఆడుతున్న తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఆయనతో పాటు ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

దేవాలయాల ఆస్తుల పరిరక్షణ బాధ్యత అందరిదీ



మాట్లాడుతున్న విశ్వహిందూపరిషత్ నాయకుడు ప్రతాప్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: హిందూ దేవాలయాల ఆస్తులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు తూముకుంట ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం బనగానపల్లె జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో హిందూ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. హిందువులు కులాలను పక్కన పెట్టి ఐకమత్యంగా ఉండాలని సూచించారు. ఆలయాల ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లాలో ఉన్న హిందూ సమాజానికి ఏదైన అపద వస్తే విశ్వహిందూ పరిషత్ ఆదుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఇందు కోసం అక్టోబర్‌లో ట్రోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం కొందరు వక్తలు మాట్లాడుతూ.. మత మర్పిడిలు పోవాలంటే అంటరాని తనం పోవాలని తెలిపారు. అన్ని సామాజిక వర్గాలకు ఆలయ ప్రవేశం కల్పించాలని.. వివక్ష చూపకుండా హిందువులంతా ఒక్కటే అన్న సందేశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వక్తలు ఓబులరెడ్డి, రమణారెడ్డి, న్యాయవాది మాధవరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, కిశోర్‌కుమార్, మాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నాగమల్లారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చల్లాకు ఘన నివాళి



చల్లా రామక్రిష్ణారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

అవుకు: దివంగత నేత చల్లా రామక్రిష్ణారెడ్డి 76వ జయంతి సందర్భంగా తాడిపత్రి రహదారిలోని చల్లా ఫామ్‌హౌస్‌లో ఉన్న ఆయన సమాధి వద్ద కుటుంబ సభ్యులు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, అవుకు సొసైటీ చైర్‌పర్సన్ చల్లా విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి, నాయకులు పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డి, చల్లా హిమకర్ రెడ్డి, చల్లా ప్రణవ్‌నాథ్ రెడ్డి, చల్లా అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



వెంకటసుబ్బన్న మృతదేహం

అవుకు: మండల పరిధిలోని సంగపట్నం గ్రామ సమీపంలో ఉన్న గనిలో విద్యుత్ షాక్ తగిలి ఓ వ్యక్తి మృతి చెందాడు. కొలిమిగుండ్ల మండలం బెలుం గ్రామానికి చెందిన వెంకట సుబ్బన్న (45) సోమవారం గనిలో పని చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
డోన్, బనగానపల్లె
90100 55532 (డోన్)
99122 20581 (బనగానపల్లె)
Office mail : sakshiknladvt@gmail.com